# సాక్షి ఆదిలాబాద్

గురువారం । 12 । అక్టోబర్ । 2023






**మహిళలపై క్యాన్సర్ పంజా!**
మహిళలపై క్యాన్సర్ భూతం పంజా విసురుతోంది. ప్రభుత్వ మహిళా ఆరోగ్య భరోసా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో పలువురిలో వ్యాధి నిర్ధారణ అవుతోంది. 10లో▸



**బెల్ట్‌షాపులపై కొరడా**
గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం 36.0/23.0

**వాతావరణం**
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

## న్యూస్‌రీల్

### ఫేషియల్ హాజరు వంద శాతం నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో వందశాతం ఫేషియల్ రికగ్నైజింగ్ హాజరు నమోదు చేయాలని డీఈవో ప్రణీత సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రధానోపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. ఎంఈవోలు ఆయా పాఠశాలల్లో ఫేషియల్ రికగ్నైజింగ్ హాజరును పరిశీలించాలని సూచించారు. యూడైస్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాల మార్పులు, చేర్పులు, తొలగింపులు, పరీక్షలకు సంబంధించి మార్కులు వేయడం, ఇతర అంశాలపై సమీక్షించారు. సెక్టోరల్ అధికారి నారాయణ, స్టాటిస్టికల్ అధికారి ఉస్మాన్, నర్సయ్య, ఎంఈవో నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 19న వాహనాల వేలం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ నాలుగు ద్విచక్ర వాహనాలను ఈనెల 19వ తేదీన డీపీఈవో హిమశ్రీ సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ప్రభుత్వం నిర్దేశించిన డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

### జోనల్ క్రీడలకు సర్వం సిద్ధం



మైదానాన్ని పరిశీలిస్తున్న ఆర్సీవో, ఈఈ

ఇచ్చోడ: ఈ నెల 13నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న ఏడో జోనల్ ఆటల పోటీలకు సర్వం సిద్ధం చేసినట్లు గురుకులాల ఆర్సీవో గంగాధర్, ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు తెలిపారు. బుధవారం గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో క్రీడల సన్నాహక సమావేశం నిర్వహించి అనంతరం మైదానాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఆదిలాబాద్, మెదక్ రీజియన్లలోని 18 పాఠశాలల నుంచి 765 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. అండర్–14, 17, 19 కేటగిరీల్లో విద్యార్థులు తమ ప్రతిభ చూపనున్నట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రావు, బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అశ్విని ఉన్నారు.

### చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా

బోథ్: చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచామని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. బుధవారం తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోగల ఘన్‌పూర్ చెక్‌పోస్టును బోథ్ సీఐ భీమేశ్‌తో కలిసి పరిశీలించారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రూ.50 వేల కంటే ఎక్కువగా నగదు తీసుకువస్తే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను తహసీల్దార్ సుభాష్‌చంద్రతో కలిసి పరిశీలించారు. బోథ్ ఎస్సై రాము, పోలీస్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

### లైసెన్స్‌డ్ ఆయుధాల వినియోగం నిషేధం

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయుధాలు కలిగి ఉండటాన్ని నిషేధిస్తూ భారత ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లైసెన్స్‌డ్ ఆయుధాలు, కత్తులు వెంట తీసుకువెళ్లడం నిషేధమని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడేదాకా ఉత్తర్వులు అమలులో ఉంటాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ వివరించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ నూతన బ్యాచ్ నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించినట్లు డిపో మేనేజర్ కల్పన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.15,600 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, 30 రోజులపాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఆదిలాబాద్ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ జీ విష్ణు, ఎస్కే యూసుఫ్‌ను 7382840166, 7382840349 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.




# బీఫాం టెన్షన్

- బీఆర్‌ఎస్ అభ్యర్థుల్లో కొత్త గుబులు
- కాంగ్రెస్‌లో తెరపైకి కొత్త నాయకులు
- బీజేపీ, కాంగ్రెస్‌లో సర్వే ఆధారంగా..
- దసరాలోపు అభ్యర్థులను ప్రకటించేనా?

సాక్షి, ఆదిలాబాద్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత వివిధ రాజకీయ పార్టీల ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. బీఆర్‌ఎస్ ఇదివరకే అభ్యర్థులను ప్రకటించింది. కొద్దిరోజుల్లో పార్టీ బీఫాంలు అందజేయనుండగా వారిలో గుబులు మొదలైంది. కాగా, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదు. దసరాలోపు అభ్యర్థులను ప్రకటించి ఉత్కంఠకు ఫుల్‌స్టాప్ పెడతాయా? లేదా.. మరింత జాప్యం చేస్తాయా? అని జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

**కాంగ్రెస్‌లో ఇదీ పరిస్థితి..**

కాంగ్రెస్ టికెట్ విషయంలో నియోజకవర్గాల వారీగా కొందరి పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఆదిలాబాద్ నుంచి కంది శ్రీనివాసరెడ్డి, ఖానాపూర్ నుంచి వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ నుంచి శ్యామ్ నాయక్ పేర్లు వినిపిస్తున్నాయి. బోథ్ నుంచి ఇంకా ఎవరిపేరు తెరపైకి రాలేదు. అయితే ఆ పార్టీ నుంచి అభ్యర్థుల జాబితా ఖరారైనప్పుడే ఈ ఉత్కంఠకు తెరపడే పరిస్థితి ఉంది.

**బీజేపీ అభ్యర్థుల ఎంపిక ఎప్పుడో?**

ఆదిలాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిత్వాన్ని దక్కించుకునేందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినీరెడ్డి పోటీ పడుతున్నారు. ఖానాపూర్ నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ టికెట్ ఆశిస్తున్నారు. బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల నుంచి కూడా పలువురు ఆశావహులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దసరా లోపే జాబితా ఖరారయ్యే అవకాశం ఉందని పార్టీలో చర్చ సాగుతోంది. కాంగ్రెస్, బీజేపీల్లో సర్వేల ఆధారంగా అభ్యర్థుల వడపోత జరగనుంది. ఆ తర్వాత మిగిలిన పేర్లు పరిశీలించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ఆయా పార్టీలో చర్చ జరుగుతోంది.

**బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించినా..**

బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే జోగు రామన్నను పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. బోథ్ నుంచి నేరడిగొండ జెడ్పీటీసీ సభ్యుడు అనిల్ జాదవ్, ఖానాపూర్ నుంచి భూక్య జాన్సన్‌నాయక్, ఆసిఫాబాద్ నుంచి కోవ లక్ష్మిని కూడా అభ్యర్థులుగా ప్రకటించింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఇప్పుడా అభ్యర్థుల్లో బీ ఫాం గుబులు మొదలైంది. ఈనెల 15న సీఎం కేసీఆర్ పార్టీ అభ్యర్థులకు బీఫాంలు అందజేయనున్నారు. బోథ్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎంపీ గోడం నగేశ్ బుధవారం మరోసారి మంత్రి కేటీఆర్‌ను కలిశారు. అభ్యర్థి అనిల్ జాదవ్ కూడా ఆయనతో ఉన్నారు. ఎమ్మెల్సీ పదవి ఇస్తామని గోడం నగేశ్‌కు కేటీఆర్ హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు.

**మహిళా అభ్యర్థుల ఆశలు**

కాంగ్రెస్ నుంచి గండ్రత్ సుజాత, బీజేపీ నుంచి చిట్యాల సుహాసినీరెడ్డి ఆయా పార్టీల అభ్యర్థిత్వం కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లకు సంబంధించి బిల్లు ఆమోదం పొందిన తర్వాత అది అమలుకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఈ ఎన్నికల్లో మహిళా ఆశావహులపై పార్టీల పరిశీలన ఎలా ఉంటుందనే విషయంలో వారు ఆశలు పెట్టుకున్నారు. పార్టీలు అవకాశం కల్పిస్తే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని మహిళా నేతలు ఆసక్తి కనబర్చుతున్నారు.

# నియమావళిని ఉల్లంఘిస్తే కేసులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- పక్కాగా ఎన్నికల వ్యయ పరిశీలన
- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పక్కాగా పరిశీలించి నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పార్టీలు, అభ్యర్థులు ఎప్పటికప్పుడు ఎన్నికల వ్యయ వివరాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. సభలు, సమావేశాలు, ర్యాలీల అనుమతి కోసం 48గంటల ముందే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1950కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. అలాగే సీ–విజిల్ యాప్ ద్వారా లైవ్ ఫొటోలు, వీడియోల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌తో నగేశ్ మరో భేటీ



కేటీఆర్‌ను కలిసిన గోడం నగేశ్, అనిల్‌జాదవ్

ఇచ్చోడ: హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో బుధవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మాజీ ఎంపీ గోడం నగేశ్ రెండోసారి భేటీ అయ్యారు. ఆయన వెంట ఎమ్మెల్సీ దండే విఠల్, బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. బోథ్ బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడ్డ గోడం నగేశ్ పార్టీ మారుతారన్న ప్రచారం జరిగింది. అప్పట్లో కేటీఆర్ నగేశ్‌ను హైదరాబాద్‌కు పిలిపించి చర్చలు జరిపారు. అనిల్‌జాదవ్ గెలుపునకు కృషి చేయాలని, భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అప్పటి నుంచి గోడం నగేశ్ బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నప్పటికీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో కేటీఆర్ మరోసారి గోడం నగేశ్‌తో పాటు అతడి ముఖ్య అనుచరులతో భేటీ అయ్యారు. ఈ భేటీలో నగేశ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. నగేశ్ వెంట తాంసి, భీంపూర్ జెడ్పీటీసీ సభ్యులు తాటిపెల్లి రాజు, కుమ్ర సుధాకర్ తదితరులున్నారు.

# ‘బీజేపీని ప్రజలు నమ్మరు’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: బీజేపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2016–17లో సీసీఐ పునఃప్రారంభానికి అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామని, దీనిపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సీసీఐకి సంబంధించి ఈ–టెండర్ ద్వారా స్క్రాప్‌లో విక్రయించడానికి కేంద్రం అప్పట్లో ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి ప్రధాని వాజ్‌పేయ్ హయాంలోనే సీసీఐ మూతపడిందని తెలిపారు. ఆదివాసీల కోసం బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. జిల్లాకు గిరిజన యూనివర్సిటీ ప్రకటించలేదని విమర్శించారు. ఆర్వోఎఫ్‌ఆర్ ద్వారా 85వేల మందికి పట్టాలిచ్చామని తెలిపారు. పసుపు బోర్డు ప్రకటించిన కేంద్రం రైతులకు ఎలాంటి ప్రయోజనాలుంటాయో వివరించలేదని విమర్శించారు. నాయకులు మెట్టు ప్రహ్లాద్, నారాయణ, గంగారెడ్డి, సాజిదొద్దీన్, రాజన్న తదితరులున్నారు.

# ‘చదువుతోనే లక్ష్య సాధన’



లైబ్రరీలో పిల్లలతో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: చదువుతోనే లక్ష్య సాధన సులువవుతుందని ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. పోలీస్ ఉద్యోగుల పిల్లలు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి తోడ్పడేలా జిల్లా పోలీస్ యంత్రాంగం తరఫున పోటీ పరీక్షలకు సంసిద్ధమయ్యేలా హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో చదువు మాత్రమే ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు విద్యపై ఇష్టాన్ని పెంపొందించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కసారి జ్ఞానాన్ని సంపాదించిన తర్వాత అది జీవితంలో మనల్ని విడిచిపెట్టి పోదనే విషయాన్ని గుర్తు చేశారు. పోలీస్ పిల్లల ఆవశ్యకతను గుర్తించి భవిష్యత్‌లో హైదరాబాద్ నుంచి నిష్ణాతులైన సిబ్బందితో శిక్షణ తరగతులు నిర్వహించి పోటీ పరీక్షలకు ఆదిలాబాద్ జిల్లా నుంచి పోలీసుల పిల్లలు ఎంపికయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, ఈ గ్రంథాలయం ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో ఉన్న నవీకరించిన పుస్తకాలన్నింటినీ అందుబాటులో ఉంచి పిల్లలకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌క్వార్టర్ ఆర్ఐ నవీన్ కుమార్, ట్రాఫిక్ సీఐ, రిజర్వ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# ‘ఇన్‌స్పైర్’ అయ్యేనా?

- జిల్లా కేంద్రంలో మేళా నిర్వహణకు అధికారులు సన్నద్ధం
- 112 ప్రాజెక్ట్‌లను ప్రకటించిన కేంద్రం
- రెడీమేడ్ ప్రదర్శనలకు చెక్‌పడేనా?



ఆదిలాబాద్‌టౌన్: చదువుతోపాటు విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏటా ఇన్‌స్పైర్ మేళా నిర్వహిస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులంతా ప్రాజెక్టులు తయారు చేసేందుకు ప్రోత్సహిస్తోంది. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చర్యలు చేపడుతోంది. 2022–2023 విద్యాసంవత్సరానికి జిల్లాలో 112 ప్రాజెక్టులను కేంద్రం ప్రకటించింది. డిసెంబర్ 15లోపు మేళా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. దీంతో ఆ దిశగా అధికారులు మేళా నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు.

**722 ప్రాజెక్టుల్లో 112 ఎంపిక**

2022–23 ఇన్‌స్పైర్ మానక్‌కు కోసం జిల్లాలోని ఆరు నుంచి 10 తరగతులకు సంబంధించి అన్ని యాజమాన్యాల పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా పాఠశాలల విద్యార్థులు 722 ప్రాజెక్ట్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగా 112 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఇదివరకు ఆగస్టులో ఈ మేళా నిర్వహిస్తుండగా, కరోనా నేపథ్యంలో రెండుమూడేళ్లుగా ఆలస్యంగా నిర్వహిస్తున్నారు. మేళాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి, అక్కడ ప్రతిభ కనబర్చిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. బహుమతులు కూడా ప్రదానం చేస్తారు.

**నీరుగారుతున్న లక్ష్యం**

విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం, ఉపాధ్యాయుల అలసత్వం కారణంగా ఈ కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన విద్యార్థి బ్యాంక్ ఖాతాలో రూ.10వేల చొప్పున జమ చేస్తున్నారు. వాటిలో రూ.5వేలు ప్రాజెక్టు కోసం, మరో రూ.5వేలు ట్రాన్స్‌పోర్టు కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. కార్యక్రమం ప్రారంభమైన నుంచి ఇప్పటివరకూ పూర్తిస్థాయిలో ప్రయోగాలను విద్యార్థులు ప్రదర్శించలేదు. వీటిలో సగం కంటే ఎక్కువ రెడీమేడ్ ప్రదర్శనలే. మార్కెట్‌లో లభించే కూరగాయలు, ఇతర బొమ్మలు కొనుగోలు చేసి మూడురోజుల పాటు ప్రదర్శించి చేతులు దులుపుకొంటున్నారు. దూర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు మూడురోజుల పాటు జిల్లా కేంద్రంలో కాలక్షేపం చేసేందుకు వస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు ఎంపికైన పాఠశాలలకు నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల నుంచి పలువురు రెడీమేడ్ ప్రదర్శనలు ఇచ్చి డబ్బులు తీసుకుని వెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

**ఈసారైనా చెక్ పడేనా?**

డిసెంబర్ 15న ఇన్‌స్పైర్ మేళా నిర్వహించేలా అధికారులు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విద్యార్థుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం నిధులు జమ చేసింది. ఇప్పటినుంచైనా సైన్స్, గణిత ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి ప్రాజెక్టులు తయారు చేయిస్తే వారికి ఎంతో మేలు జరుగుతుంది. జిల్లా పేరు కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలబడనుంది. విద్యాశాఖ అధికారులు ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులు, పాఠశాల వివరాలను సేకరించి తగిన సూచనలు, సలహాలు ఇస్తే మరింత ఉపయోగకరమైన ప్రయోగాలు చేసే అవకాశం ఉంటుంది. నిత్యజీవితంలో మానవులకు ఉపయోగపడేవి.. వ్యర్థాలతో ఉపయోగాలు.. తదితర అంశాలపై ప్రయోగాలు తయారు చేస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

**గురువుల ప్రోత్సాహం కరువు**

విద్యార్థులను ప్రాజెక్టుల తయారీ కోసం ప్రోత్సహించాల్సిన ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. మేళా తేదీ ప్రకటించిన తర్వాత హడావుడిగా ఏదో ఒకటి కొనుగోలు చేసి చార్ట్‌ల రూపంలో ఇన్‌స్పైర్ మేళాలో ప్రదర్శిస్తున్నారు. వారి అలసత్వం విద్యార్థులకు శాపంగా మారుతోంది. ప్రాజెక్టులను చూసేందుకు వచ్చే విద్యార్థులకూ ఏమీ అర్థం కాని పరిస్థితి నెలకొంటోంది.

**పకడ్బందీగా నిర్వహిస్తాం**



2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ మేళాకు 112 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఈసారి పకడ్బందీగా ప్రయోగాలు తయారు చేసేలా చర్యలు చేపడతాం. రెడీమేడ్ ప్రయోగాలు తీసుకురాకూడదు. విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానం పెంపొందించి వారిని భావిశాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు కృషి చేయాలి.

– రఘురమణ, జిల్లా సైన్స్ అధికారి

# పదోన్నతి ఉద్యోగులకు పోస్టింగ్

- పలువురు ఆర్‌ఐలకు స్థానచలనం

కైలాస్‌నగర్: జిల్లా రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ ఇటీవల సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందినవారికి పోస్టింగ్ కల్పిస్తూ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పలు మండలాల ఆర్‌ఐలకు స్థానచలనం కల్పించారు. పదోన్నతి పొందిన వారిలో రొడ్డ నర్సింహులు, రాథోడ్ సురేందర్, ఎస్.భరద్వాజ్‌ను కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్లుగా, ఎండీ సాజిద్‌ను బేల ఆర్‌ఐ–2గా, సెడ్మకి తిరుపతిని గాదిగూడ ఆర్‌ఐ–2గా, కుమ్మరి సాయిరాంను ఉట్నూరు ఆర్డీవో ఆఫీస్‌కు బదిలీ చేశారు. బీ కార్తీక్‌ను భీంపూర్ తహసీల్దార్ కార్యాలయానికి, ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ–1గా పనిచేస్తున్న రాథోడ్ కళావతిని బేల తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, అక్కడ ఆర్‌ఐ–2గా పని చేస్తున్న ఎస్.నారాయణను ఆమె స్థానంలో నియమించారు. బోథ్‌లో ఆర్‌ఐ–1గా పని చేస్తున్న ఎల్.దశరథ్‌ను నార్నూర్ ఆర్‌ఐ–2గా బదిలీ చేయగా.. ఆ స్థానంలో పని చేస్తున్న రాథోడ్ శకుంతలను ఇంద్రవెల్లి సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. ఇంద్రవెల్లిలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పీ అరుణ్‌కుమార్‌ను గుడిహత్నూర్ ఆర్‌ఐ–1గా నియమించారు. అక్కడ పని చేస్తున్న సీహెచ్ చంద్రశేఖర్‌ను బోథ్ ఆర్‌ఐ–1గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## లింగ వివక్ష రూపుమాపాలి

ఆదిలాబాద్‌టౌన్: లింగ వివక్ష రూపుమాపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కల్పించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి మాట్లాడుతూ.. లింగ వివక్షపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం లింగ వివక్ష, హక్కులు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, డీసీపీవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణపై సమావేశం



నాయకులతో మాట్లాడుతున్న చాహత్ బాజ్‌పాయ్

బోథ్: నియోజకవర్గ కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సెక్టార్ అధికారులు, తహసీల్దార్లతో బోథ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ బుధవారం సమావేశం నిర్వహించారు. నాయకులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయవద్దని సూచించారు. ఎన్నికల నియమావళిని పాటించాలని, అధికారుల మీద నమ్మకం లేకుంటే సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు పార్టీలు సహకరించాలని సూచించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని సూచించారు. బోథ్ తహసీల్దార్ సుభాష్‌చంద్ర, డీటీ సూరజ్‌రావు, సీఐ భీమేశ్, కాంగ్రెస్ నాయకుడు చంటి, టీడీపీ నాయకుడు అబూద్, టీజేఎస్ నాయకుడు ఆడె సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ‘ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి’



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అబ్జర్వర్ల నియామకాల కోసం సరిపడా సిబ్బందిని గుర్తిస్తూ ర్యాండమైజేషన్ ద్వారా నియామకాలు చేపట్టాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులు నిర్వహించాలని, అవసరమైన సిబ్బందిని రిజర్వ్‌లో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా సరిపడా వాహనాలు సిద్ధం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంటనే నివేదికలు అందించాలని పేర్కొన్నారు. అర్హులంతా ఈనెల 31వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పోలింగ్ శాతం పెంచేందుకు ప్రతీ ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం, కళాజాత నిర్వహించాలని స్వీప్ నోడల్ అధికారిని ఆదేశించారు. అక్రమ మద్యం, నగదు, మత్తు పదార్థాల సరఫరాపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్స్, ర్యాంపులు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు పరిశీలించి తక్షణమే అందుబాటులోకి తేవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి తదితరులున్నారు.

## క్లుప్తంగా

### మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన మట్కా నిర్వాహకుడు షేక్ అహ్మద్‌ను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం ఆ కాలనీలో దాడి చేయగా నిందితుడి వద్ద మూడు మట్కా చీటీలతో పాటు రూ.3020 నగదు లభించింది. టూటౌన్ ఎస్సై ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

### విద్యార్థిపై సీనియర్ల లైంగికదాడి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ఓ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిపై అదే పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు మంగళవారం లైంగికదాడికి పాల్పడ్డారు. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలోని విద్యార్థిపై ముగ్గురు లైంగిక దాడికి పాల్పడ్డారు. దీంతో ఆ విద్యార్థికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. బాధిత విద్యార్థి తండ్రి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

### ప్రైవేట్ ట్రావెల్ సీజ్

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ట్రావెల్స్‌లో గూడ్స్ తీసుకొస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ టాప్‌పై గూడ్స్ తీసుకువస్తుండగా తనిఖీల్లో భాగంగా వాహనాన్ని టూటౌన్ పోలీసుస్టేషన్ ఎదుట ఆపి తనిఖీ చేశారు. దీంతో వాహనాన్ని రవాణ శాఖాధికారులకు అప్పగించారు. ఈ మేరకు రవాణా శాఖాధికారులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### గిరిజన యూనివర్సిటీకి సేవాలాల్ పేరు పెట్టాలి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే గిరి జన యూనివర్సిటీకి లంబాడాల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టాలని ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మాజీ మంత్రి బంజారా సేవా సమితి జాతీయ అధ్యక్షుడు అమర్ సింగ్ తిలావత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన బీజే పీ బహిరంగ సభ విజయవంతమైందని అమిత్ షా సభకు భారీగా జనం తరలివచ్చారన్నారు. గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కేంద్రం గిరిజనుల ఆకాంక్షను గుర్తించిందన్నారు. ట్రైబల్ యూనివర్సిటీకి ఆదివాసుల ఆరా ధ్య దైవాలు సమ్మక్క సారలమ్మ పేరు పెట్టడం మో డీ గొప్పతనమని కొనియాడారు. గిరిజనుల్లో 65% ఉన్న లంబాడాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ సేవలను కేంద్రం గుర్తించాలన్నారు. గిరిజన యూ నివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామన్నారు.

### రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు బాలికల జట్టు ఎంపిక

బెల్లంపల్లి: రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టును ఎంపిక చేశారు. బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు ఎంపిక క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద మందికి పైగా బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. అండర్-19 విభాగంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన 12మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప, పీఈటీ రాధారాణి, పీడీలు సుధీప్, తిరుపతి, మమత పాల్గొన్నారు.



# మహిళలపై క్యాన్సర్ పంజా..!



మహిళలపై క్యాన్సర్ భూతం పంజా విసురుస్తోంది. ప్రభుత్వ మహిళ ఆరోగ్య భరోసా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో క్యాన్సర్ కేసులు బయటపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయం, ఇంటిపనులు, ఉద్యోగం, ఉపాధి రంగాల్లో తమవంతు పాత్ర పోషిస్తూ మహిళలు తమ ఆరోగ్య పరీక్షలు వాయిదా వేయడం సర్వసాధారణమైంది. ఈ నేపథ్యంలో ప్రతీ మహిళకు వైద్య పరీక్షలు అందాలనే ఉద్దేశంతో ఈ ఏడాది మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాల్లో ఆరోగ్య మహిళా కేంద్రాలు ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎంపిక చేసిన పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బంది మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. వ్యాధులను గుర్తించి అవసరం మేరకు జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. క్యాన్సర్ గుర్తించిన వారిని హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఎంఎన్‌జే ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. ఇప్పటివరకు మంచిర్యాల జిల్లాకు చెందిన ఓరల్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న పది మందిని, రొమ్ము క్యాన్సర్ లక్షణాలు ఉన్న 35మందిని, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఉన్న 15మందిని రెఫర్ చేశారు.

– సాక్షి, మంచిర్యాలడెస్క్



మంచిర్యాలలోని పాలియేటివ్ కేర్ సెంటర్

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేసులు
- ప్రభుత్వ మహిళ ఆరోగ్య భరోసా కేంద్రాల్లో పరీక్షలు

**పెరుగుతున్న కేసుల సంఖ్య**

ఇప్పటివరకు ఉమ్మడి జిల్యా వ్యాప్తంగా పలువురు మహిళలు వివిధ రకాల క్యాన్సర్ బారినపడ్డారు. ఓరల్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడ్డట్లు గుర్తించారు. ప్రభుత్వ మహిళ ఆరోగ్య భరోసా కేంద్రాల్లో బాధితుల సంఖ్య తెలుస్తుండగా.. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పరీక్షలు, చికిత్స చేయించుకునే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుందని తెలుస్తోంది. నిర్మల్ జిల్లాలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి.

**పాలియేటివ్ కేర్ సెంటర్లలో చికిత్స**

మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పాలియేటివ్ కేర్ సెంటర్లు ఉన్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 2002 ఫిబ్రవరి 8న పాలియేటివ్ కేర్ సెంటర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. క్యాన్సర్‌తోపాటు నాన్ క్యాన్సర్‌కు సంబంధించిన క్రానిక్ బెడ్ రిడేన్ అంటే పూర్తిగా మంచానికే పరిమితమైన వారు, కిడ్నీ ఫెయిల్యూర్, పక్షవాతం, క్రానిక్ డయాబెటిక్, ఫిజియోథెరపీ అవసరమైన వారి కోసమని ఎనిమిది బెడ్లతో ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటివరకు క్యాన్సర్‌కు సంబంధించిన 430 మంది, నాన్ క్యాన్సర్‌కు సంబంధించి 1500మందికి చికిత్స అందించారు. అన్ని జిల్లాల్లో త్వరలో కీమో థెరపీ ప్రారంభిస్తామని, మొదటగా ప్రయోగాత్మకంగా ఎనిమిది జిల్లాల్లో ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఇటీవల ప్రకటించారు. కీమో థెరపీ అందుబాటులోకి వస్తే రోగులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది.

**జిల్లాల వారీగా పరిశీలిస్తే..**

| పరీక్షలు | మంచిర్యాల | నిర్మల్ | ఆదిలాబాద్ | కుమురంభీం |
|---|---|---|---|---|
| ఓరల్ క్యాన్సర్ టెస్టులు చేసింది: | 6,427 | 13 | 3,333 | 2308 |
| ఓరల్ క్యాన్సర్ అనుమానితులు: | 29 | 13 | 1 | 0 |
| రొమ్ము క్యాన్సర్ టెస్టులు చేసింది: | 6,480 | 41 | 3,313 | 1857 |
| కొత్తగా రొమ్ము క్యాన్సర్ గుర్తించింది: | 7 | 41 | 0 | 5 |
| గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ టెస్టులు: | 1,733 | 189 | 1,446 | 484 |
| గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నమోదు: | 4 | 33 | 24 | 0 |

### పౌష్టికాహారం తీసుకోవాలి



క్యాన్సర్ బారిన పడే వారిలో ఎక్కువ మంది ధూమపానం, మద్యపానం, పొగాకు సంబంధిత వాటిని వినియోగిస్తున్న వారే ఎక్కువగా ఉంటారు. సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడకుండా రోగ నిరోధక శక్తి పెంపొందే అవకాశం ఉంటుంది. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సరైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధులకు దూరమయ్యే అవకాశం ఉంది. – డాక్టర్ శ్రీనివాస్, పాలియేటివ్ కేర్ వైద్యుడు, మంచిర్యాల

## ప్రచార రథాలు సిద్ధం..



బీఆర్‌ఎస్ ప్రచార రథం



బీజేపీ ప్రచార రథం



కాంగ్రెస్ ప్రచార రథం

అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజల్లోకి వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నాయి. బరిలో నిలిచే అభ్యర్థుల ప్రచారానికి ఉపయోగించే ప్రచార రథాలను సిద్ధం చేస్తున్నారు. అధికార బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్ ప్రచార రథాలు సిద్ధంగా ఉన్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

## ప్రతీ వాహనం క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

సారంగపూర్: అంతర్రాష్ట్ర రహదారిపై రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సిర్పెల్లి గ్రామంలో మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వద్ద తనిఖీ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రం అయిన మహారాష్ట్ర నుంచి మద్యం, డబ్బు సరఫరా కాకుండా చూడాలన్నారు. వాహనాల్లో రాకపోకలు సాగించే పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసులు విధుల్లో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా అడ్డుకునే బాధ్యత సైతం పోలీసు సిబ్బందిపై ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట నిర్మల్ రూరల్ సీఐ బి.శ్రీనివాస్, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



పట్టుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

నేరడిగొండ: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఉట్నూర్ డీఎస్పీ చుక్క నాగేందర్ గౌడ్ హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా బుధవారం నిర్మల్‌కు చెందిన ప్రహ్లాద్ రెడ్డి కారులో 171 బీరుబాటిళ్ల తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యంతో పాటు కారును స్వాధీనం చేసుకొ ని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అ క్రమంగా మద్యం, డబ్బు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇ చ్చోడ సీఐ చంద్రశేఖర్, ఎస్సై సాయన్న, పోలీసులు భాస్కర్‌గౌడ్, శంకర్, దినేష్ పాల్గొన్నారు.

**బెల్టు షాపులపై కొరడా**

ఆదిలాబాద్‌టౌన్: గ్రామాల్లో బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తున్న వారిపై ఎక్సైజ్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆదిలాబాద్‌రూరల్ మండలంతో పాటు జిల్లా కేంద్రంలోనూ తనిఖీలు నిర్వహించారు. రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో పతి గంగమ్మ తన కిరాణ షాపులో మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 12 డౌన్ టౌన్ విస్కీ 180ఎంఎల్ బాటిళ్లను సీజ్ చేశారు. అదే విధంగా కచ్‌కంటి గ్రామంలో సర్గాని నర్సయ్య ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచడంతో దాడులు చేసి 16 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు సంజీవ్ కుమార్, నానక్‌సింగ్, శ్రీధర్, హన్మంతు, లత, సంధ్య తదితరులు ఉన్నారు.

**మద్యం స్వాధీనం**

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని బెల్ట్‌షాప్‌పై పోలీసులు బుధవారం దాడిచేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలోని బెల్ట్‌షాప్‌పైన ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో దాడి నిర్వహించి స్ట్రాంగ్ బీర్లు 89, కర్మార లేగర్ బీర్స్ 26, కేఎఫ్ 17, విస్కీ 22, రాయల్ స్ట్రాంగ్ విస్కీ 15, రాయల్ చాలెంజ్ విస్కీ 13, ఓసీలు 17, గోల్డ్‌మార్కు విస్కీ 27, బడ్‌వైజర్ మాగ్నమ్ బీర్లు 24, ప్రీమియం బీర్లు 13 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

**మద్యం పట్టివేత**

భైంసాటౌన్: నిబంధనలకు విరుద్ధంగా ఆటోలో తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను తెలిపారు. మహాగాం గ్రామానికి చెందిన తాండ్ర గణేశ్, బగడ్వార్ సాయన్న భైంసా నుంచి ఆటోలో రూ.74,634 విలువైన మద్యం బాటిళ్ల తరలిస్తుండగా పార్డి(బి) బైపాస్ రోడ్ వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సైలు పూర్ణ, సందీప్, శ్రీకాంత్ ఉన్నారు.

**గుడుంబా పట్టివేత**

దస్తురాబాద్: మండలంలోని మున్యాలతండా గ్రామంలో 25లీటర్ల గుడుంబాను బుధవా రం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని మున్యాలతండాలో గుడుంబాను విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి అజ్మీరా రవి ఇంట్లో 25 లీటర్ల గు డుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వేర్వేరు కారణాలతో ఐదుగురు మృతి



చంద్రబాయి(ఫైల్)

తానూరు: ప్రమాదవశాత్తు గాయపడిన వృద్ధురాలు బుధవారం మృతిచెందింది. ఎస్సై సందీప్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన హెగ్డె చంద్రబాయి (68) వారంరోజులుగా చలి జ్వరంతో బాధపడుతోంది. మంగళవారం రాత్రి మంటకాగేందుకు పోయివద్ద పడుకుంది. ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో కేకలు వేసింది. కుటుంబ సభ్యులు గమనించి మంటలు ఆర్పివేసి చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలి కుమారుడు పాండురంగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్ననట్లు వెల్లడించారు.

**జ్వరంతో మహిళ మృతి**



మౌనిక (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సోలంకి మౌనిక(36) జ్వరంతో మృతి చెందింది. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెను మహారాష్ట్రలోని యవత్మాల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారం క్రితం నిర్మల్, బోథ్, ఆదిలాబాద్ రిమ్స్‌లో సైతం చికిత్స చేయించినప్పటికీ నయం కాకపోవడంతో మహారాష్ట్రకు తరలించినట్లు పేర్కొన్నారు. మృతురాలికి భర్త గోవన్ సింగ్‌తో పాటు ముగ్గురు కుమారులున్నారు.

**ఫిట్స్‌తో ఒకరి మృతి**



లింగన్న మృతదేహం

లక్ష్మణచాంద: ఫిట్స్‌తో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని మల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన పుట్టి లింగన్న (38) వ్యవసాయంతో పాటు చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆరేళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం గ్రామానికి చెందిన తమ సంఘం సభ్యులతో కలిసి చింతల్‌చాంద సమీపంలోని గోదావరిలో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో మూర్ఛ రావడంతో గమనించిన గ్రామస్తులు వెంటనే ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం కొద్ది గంటల తరువాత లింగన్న మాములు స్థితికి రావడంతో మళ్లీ సాయంత్రం 4గంటల ప్రాంతంలో చింతల్‌చాంద గోదావరికి ద్విచక్ర వాహనంపై చేపలు పట్టడానికి బయలుదేరాడు. ద్రోణ ఉన్నత పాఠశాల సమీపంలో మూర్ఛ రావడంతో రోడ్డు పక్కనే ఉన్న వరి పొలంలో పడిపోయాడు. దీంతో ఊపిరి ఆడకపోవడంతో అక్కడే మృతి చెందాడు. భార్య పుట్టి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. లింగన్నకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు.

**చెరువులోపడి యువకుడు..**

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులోపడి భూమన్న (35) మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం భూమన్న గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లగా కాలుజారి నీటిలో పడి మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**బావిలోపడి యువకుడు మృతి**



రాజేశ్వర్ మృతదేహం

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన సూర రాజేశ్వర్(25) వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. ఈ నెల 10న గ్రామ సమీపంలోని తన బాబాయి వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి, ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. బుధవారం ఉదయం మృతదేహం బయటకు తేలింది. రాజేశ్వర్‌కు ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై భీంరావు పేర్కొన్నారు.

## ఆకాశవాణిలో గజ్జలమ్మదేవి భక్తి గీతాలు



భక్తిగీతాలు ఆలపిస్తున్న భజన బృందం

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి భక్తి గీతాలను ప్రముఖ కవి సత్యానంద గడ్డపు గజ్జారాం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఆకాశవాణిలో ఆలపించారు. మేలుకొలుపు, గజ్జలమ్మ వందనం, గల్లు గల్లున రావమ్మ కుంటాల గజ్జలమ్మ భక్తి గీతాలను జిల్కరి శ్రీనివాస్, అశోక్, రాములు, రాజన్న, చిన్నయ్య, గజ్జారాం ఆలపించిన భక్తిగీతాలను ఆకాశవాణిలో ప్రసారం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని జానపద కళలను, కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాల్లో ప్రోత్సహిస్తున్నామని ఆదిలాబాద్ ఆకాశవాణి ముఖ్య కార్యక్రమ అధికారి రామేశ్వర్ కేంద్రే తెలిపారు. ఆకాశవాణిలో వీటిని ప్రసారం చేసి భావితరాల కోసం పొందుపరిచి శ్రోతలను అలరింపజేస్తున్నామని ఆయన వెల్లడించాడు.

## వివిధ కారణాలతో నలుగురు ఆత్మహత్య

**వృద్ధుడి ఆత్మహత్య**



రాంజి గంగాధర్ (ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన రాంజి గంగాధర్(61) బుధవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గంగాధర్ భార్య భారతి ఎనిమిది నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మానసికంగా కృంగిపోయిన గంగాధర్ మనస్తాపానికి గురై లింబా(బి) నుంచి ఓలా వెళ్లే మార్గంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. మృతుడి సోదరుడు శివరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవ్‌రావు తెలిపారు.

**మద్యానికి బానిసై ఒకరు..**

బోథ్: మండల కేంద్రానికి చెందిన సాదుల చంద్రయ్య(57) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాము వివరాల ప్రకారం.. చంద్రయ్య గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చంద్రయ్యకు భార్య, కుమారుడు, కూతుర్లు ఉన్నారు. భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము పేర్కొన్నాడు.

**ఉరేసుకుని యువకుడు..**


ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బట్టిసావర్‌గాం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ వివరాల ప్రకారం... గంధం వెంకటేష్ (34) దేవాపూర్ గ్రామానికి చెందిన శ్రీజతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం.. వెంకటేశ్ ప్రతీ రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఇదే క్రమంలో భార్య శ్రీజ పిల్లలను తండ్రి వద్ద వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లింది. ఏడాది కిందట వెంకటేశ్ తల్లి లక్ష్మి కోడలుకు నచ్చచెప్పి ఇంటికి తీసుకొచ్చింది. అయినా వెంకటేశ్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఆమె మళ్లీ పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య రావడం లేదని మనస్తాపానికి గురైన వెంకటేశ్ మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

**ట్రైన్ కిందపడి..**

మందమర్రిరూరల్: మందమర్రిలోని విద్యానగర్‌కు చెందిన మోతె బాపు(50) రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ వివరాల ప్రకారం... కూలీపని చేసుకునే మోతె బాపు కొంత కాలంగా తాగుడుకు బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు తాగుడు మానేయమని ఎంత చెప్పినా వినకుండా పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బుధవారం మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్లే గుర్తు తెలియని ట్రైన్‌కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కూతుర్లు ఉన్నారు.

## అరచేతిలో పంచాయతీ సమాచారం

- అందుబాటులోకి 'మేరీ పంచాయతీ' యాప్




'మేరీ పంచాయతీ' యాప్‌లో నమోదు చేసిన గ్రామపంచాయతీ సమాచారం

నేరడిగొండ: గ్రామపంచాయతీ ఆదాయ, వ్యయాల విషయంలో పారదర్శకత పాటించేలా కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయతీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల వివరాలను పంచాయతీ కార్యాలయాలకు వెళ్లకుండానే యాప్ ద్వారా పరిశీలించవచ్చు. పంచాయతీలకు సంబంధించిన పద్దుల వివరాలు ప్రజల ముందుకు వచ్చాయి. ఈ యాప్‌ను 2019లోనే రూపొందించగా కొన్ని కారణాలతో వివరాలన్నింటినీ నిక్షిప్తం చేయలేదు. గతేడాది నుంచి అన్నింటినీ ఇందులో పొందుపరుస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీలకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచారు.

**ఎప్పటికప్పుడు వివరాలు అప్‌లోడ్..**

గ్రామపంచాయతీకి సంబంధించిన నిధుల వివరాలే కాకుండా సర్పంచ్, కార్యదర్శి, గ్రామ కమిటీలు, ఆస్తుల సమాచారాన్ని సైతం యాప్ ద్వారా సులువుగా తెలుసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా మంజూరు చేసే నిధుల వివరాలతో పాటు ఏయే పనులకు ఎంత మొత్తం వెచ్చించారు. పనులు ఏ దశల్లో ఉన్నాయనే సమాచం యాప్‌లో దర్శనమిస్తుంది.

**పారదర్శకతకు ప్రాధాన్యం..**

పంచాయతీ నిధుల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నిక్షిప్తం చేయడంతో పాలనలో పారదర్శకత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వాలు ఎలాంటి పనులు చేపడుతున్నాయనేది ప్రజలు సులువుగా తెలుసుకోవచ్చు. గ్రామంలో చేపట్టే పనులను జీపీఆర్‌ఎస్ ద్వారా గుర్తిస్తుండడంతో ఒక్కసారి నిధులు మంజూరైన పనికి మరోసారి బడ్జెట్ కేటాయించడానికి వీలుండదు. పద్దుల వివరాలు ప్రజల వద్దకు వెళ్లడంతో పాలకవర్గాలు పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదు. ఒకవేళ తప్పుడు నివేదికలు రూపొందిస్తే ప్రజలు ప్రశ్నించవచ్చు.

**పంచాయతీ వివరాలు ఇలా..**

ఆండ్రాయిడ్ ఫోన్‌లలో ప్లేస్టోర్‌కు వెళ్లి 'మేరీ పంచాయతీ' అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీన్ని తెరవగానే ఆర్థిక సంవత్సరం, రాష్ట్రం, జిల్లా, పంచాయతీ వివరాలు దర్శనమిస్తాయి. వాటిని నమోదు చేయగానే గ్రామపంచాయతీకి సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. గ్రామం పేరు లేదా పిన్‌కోడ్‌తో సైతం సంబంధిత పంచాయతీ వివరాలు తెలుసుకోవచ్చు.

| జిల్లా | పంచాయతీలు |
|---|---|
| ఆదిలాబాద్ | 467 |
| నిర్మల్ | 396 |
| మంచిర్యాల | 311 |
| ఆసిఫాబాద్ | 335 |

### సమాచారాన్ని సులువుగా తెలుసుకోవచ్చు



గ్రామపంచాయతీలకు సంబంధించిన వివరాలను నెలకోసారి ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా నిక్షిప్తపరుస్తారు. దీంతో ప్రజలు తమకు కావాల్సిన సమాచారాన్ని సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నిధుల కేటాయింపు, పనుల వివరాల్లో సందేహాలు ఉంటే గ్రామసభల్లో ప్రశ్నించవచ్చు.

– అరుణ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు